క్లుప్తంగా

కృష్ణచైతన్యను కలసిన సోషల్ మీడియా కన్వీనర్లు



కృష్ణచైతన్యకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సోషల్‌మీడియా కన్వీనర్, కో కన్వీనర్లు

మేదరమెట్ల: వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కొరిశపాడు మండల కన్వీనర్‌గా బొనిగల మధు, కో కన్వీనర్లుగా జీ.శివకృష్ణ, మన్నె వేణు, సీహెచ్ జాన్, జీ.సురేష్‌లను నియమించినందుకు వారు మంగళవారం శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్యను కలసి పుష్పగుచ్ఛం అందచేసి ధన్యవాదాలు తెలిపారు.

జీవాల పెంపకంలో జాగ్రత్తలు అవసరం

చీరాల టౌన్: పాడి పశువుల పెంపకంలో జీవాల ఆరోగ్యంపై పశుపోషకులు జాగ్రత్తగా ఉండటం వలన జీవాలకు సీజనల్ వ్యాధులు దరిచేరవని ఈపురుపాలెం పశువైద్యులు పావని సూచించారు. మంగళవారం మండలంలోని ఈపురుపాలెం గ్రామ పంచాయతీలో పశువైద్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం చేశారు. 54 గేదెలు, 24 దూడలకు, మేకలు 49 వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా పశువైద్యులు పావని మాట్లాడుతూ రైతులకు వ్యవసాయం, పశువుల పెంపకం ముఖ్యమైనవని, పాడి పశువుల పెంపకంలో జాగ్రత్తలు తీసుకోవడంతో పాటుగా క్రమం తప్పకుండా చూడి పరీక్షలు చేయించాలన్నారు. పశుపోషకులకు మేలు చేసేలా ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పశువైద్యశాల సిబ్బంది, పశు పోషకులు పాల్గొన్నారు.

పరస్పర దాడి కేసులు నమోదు

మేదరమెట్ల: భార్యభర్తల వివాదం నేపథ్యంలో బంధువులు ఒకరినొకరు దాడి చేసుకుని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. కొరిశపాడు మండలంలోని రావినూతల గ్రామానికి చెందిన భార్యభర్తలు కుటుంబ కలహాల నేపథ్యంలో ఇరువురి కుటుంబ సభ్యులు గొడవపడిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. ఈ మేరకు కొరిశపాడు పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఇరువర్గాలు ఫిర్యాదు చేసుకున్నట్లు ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు. కొలకలూరి మణిరత్నం, భార్య సుప్రియల మధ్య కలహాలు ఏర్పడి గొడవకు దిగారు. దీంతో మణిరత్నాన్ని అత్త శ్రావణి కర్రతో తలపై దాడి చేయగా మణిరత్నం తలకు గాయాలు కాగా అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రిలో చేరాడు. ఈమేరకు అత్త, మామలపై మణిరత్నం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అలాగే తన అమ్మనాన్నలపై దాడి చేసి, తీవ్ర పదజాలంతో దూషించాడని భర్త మణిరత్నంపై భార్య సుప్రియ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

గుండెపోటుతో వీఆర్‌ఏ మృతి



సంపూర్ణరావు మృతదేహానికి నివాళులర్పిస్తున్న తహసీల్దార్, సిబ్బంది

యద్దనపూడి: మండలంలోని అనంతవరం గ్రామ వీఆర్‌ఏ దాసరి సంపూర్ణరావు (56) గుండెపోటుతో మంగళవారం మృతి చెందాడు. యద్దనపూడి తహసీల్దార్ వెంకటరెడ్డి మృతునికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపి రూ.10 వేలు నగదు అందజేశారు. తహసీల్దార్ వెంట వీఆర్‌ఓలు శేషుబాబు, రవి, వీఆర్‌ఏలు అశోక్, సుబ్బారావు, మీరాసా తదితరులు ఉన్నారు.

వాహనాలు బహిరంగ వేలం

పర్చూరు: అధికారులు సీజ్ చేసిన వాహనాలకు రేపు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఎస్ఈబీ సీఐ యశోదరాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పర్చూరు సిబ్బంది సీజ్ చేసిన వాహనాలను డిప్యూటీ కమిషనర్ ఆఫ్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో నెల్లూరు ఆదేశాల మేరకు పర్చూరులో ఈ నెల 16వ తేదీ గురువారం మధ్యాహ్నం 3 గంటలకు బహిరంగ వేలం ఉంటుందని చెప్పారు.

రేపు ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సమావేశం

అద్దంకి రూరల్: ఏపీఎస్ఆర్టీసీ బాపట్ల జిల్లా పరిధిలోని బాపట్ల, అద్దంకి బస్టాండ్ ఆవరణలో వ్యాపార నిమిత్తం షాపుల నిర్వహణకు ఈనెల 16వ తేదీ గురువారం బాపట్ల జిల్లా అధికారి కార్యాలయం నందు ఔత్సాహిక వ్యాపారవేత్తలకు అవగాన సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా ప్రజారవాణాధికారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఔత్సాహిక వ్యాపారవేత్తలు సమావేశానికి హాజరై తమ అభిప్రాయాలు తెలపాలని కోరారు.

సైకిల్ తొక్కండి.. ఆరోగ్యంగా ఉండండి

- ఉత్సాహంగా సైకిల్ ఫర్ హెల్త్
- పాల్గొన్న విద్యార్థులు, వైద్యులు, సిబ్బంది



సంతమాగులూరు: సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులు



కారంచేడులో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, విద్యార్థులు

అద్దంకి/మేదరమెట్ల/జే.పంగులూరు: ప్రతి రోజూ సైకిల్ తొక్కడం వలన అనేక వ్యాధులను దూరం చేయడంతో పాటు ఆరోగ్యంగా ఉండొచ్చని పంగులూరు పీహెచ్‌సీ వైద్యుడు రావి మల్లికార్జునరావు అన్నారు. ఆయుష్మాన్ భారత్ హెల్త్ మేళా సైకిల్ ఫర్ హెల్త్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని 21 గ్రామాల్లో ఉన్న 14 సచివాలయాల వద్ద మంగళవారం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ క్యాన్సర్, బీపీ, షుగర్ వంటి వ్యాధులను సైకిల్ తొక్కడంతో అదుపులో ఉంచొచ్చని తెలిపారు. మనిషి మానసికంగా శారీరకంగా ఆరోగ్యంగా ఉండేందుకు సైకిల్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సైకిల్ తొక్కడం వలన ఎముకలు ధృడత్వంతో పాటు, కండరాలు బలంగా ఉంటాయన్నారు. ప్రతి రోజూ రన్నింగ్, నడక, సైక్లింగ్, యోగా, ధ్యానం చేయడం ప్రతి ఒక్కరు నేర్చుకోవాలని, ఆహార నియమాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ శివచెన్నయ్య, ఆయుర్వేద వైద్యులు కృష్ణకుమార్, సీహెచ్ఓ భారతి, పీహెచ్ఎన్ రాణికుమారి, హెల్త్ ఎడ్యుకేటర్ అనురాధ, సూపర్వైజర్ మదర్‌షా, వెంకాయమ్మ, రమాదేవి, ఫార్మసిస్ట్ పద్మావతి, ఆరోగ్య కార్యకర్తలు రాధా, సతీష్ కుమార్, ఏఎన్ఎంలు, ఆశలు, టీచర్స్, సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

☛ నిత్య జీవితంలో మానవుడు సైకిల్ తొక్కడం వల్ల అనేక రకాలైన ఉపయోగాలున్నాయని మోదేపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జయచంద్రరావు అన్నారు. ఆయన తిమ్మాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, మోదేపల్లి పీహెచ్‌సీ సిబ్బందితో కలసి సైకిల్‌పై పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. భవానీ సెంటర్, బస్టాండు సెంటర్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్ నవ్వారెడ్డి, డాక్టర్ ఎస్‌కే హకీం, గొట్టిపాటి జయసింహ, తిమ్మాయపాలెం హెచ్‌ఎం కేవీ శ్రీనివాసరావు, విశ్వభారతి పాఠశాల విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

☛ చిన్నతనం నంచే ఆహార అలవాట్లపై శ్రద్ధ తీసుకోవడం వలన ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడుతుందని మేదరమెట్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎన్‌వీ సుబ్బారావు పేర్కొన్నారు. కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల గ్రామంలో స్థానిక జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులతో కలసి మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విద్యార్థులకు ఆరోగ్య విద్యను బోధించారు.

☛ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశానుసారం ఆజాదికా అమృత్ మహోత్సవంలో భాగంగా సైకిల్ ఫర్ హెల్త్ కార్యక్రమాన్ని మండల వైద్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీడీవో సాంబశివరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ సైక్లింగ్ చేయడం వల్ల కండరాలు బలపడతాయని, శరీరంలో అధిక క్యాలరీలు కరిగించుకోవడం సైక్లింగ్‌తో సాధ్యమన్నారు. ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఐడీను జనరేట్ చేశారు. టెలీ కన్సల్టేషన్ సహాయంతో ప్రత్యేక వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ నిర్మల్ కుమార్, డాక్టర్ సాహితి, సీహెచ్‌వో ప్రసన్నకుమారి, సీహెచ్ఎన్ రామకోటమ్మ, హెల్త్ సూపర్‌వైజర్లు సత్యనారాయణరెడ్డి, రవి, పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం..

వేటపాలెం: ప్రతి రోజు వ్యాయామం చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతంగా ఉండొచ్చని వైద్యాధికారి ప్రభాకర్‌రావు సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల నుంచి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో సైకిలింగ్ పై అవగాహన ర్యాలీ మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో డీ శిరోరాణి, పి వెంకటేశ్వర్లు, శేషుబాబు, గురవమ్మ, ఎం మేరీభూషణం, మార్తమ్మ పాల్గొన్నారు.

కారంచేడు: ప్రతి రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేద్దాం.. ఆరోగ్యంగా ఉందామని వైద్యాధికారులు పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని స్వర్ణ, కారంచేడు పీహెచ్‌సీల పరిధిలో వైద్య సిబ్బంది, విద్యార్థులు, ఎంఎల్‌హెచ్‌పీలతో కలసి ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమాల్లో వైద్యులు మాట్లాడుతూ సైకిల్ ఫర్ హెల్త్ ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీలు నిర్వహించామన్నారు. గ్రామాల్లో సైకిల్ తొక్కుతూ ప్రజల్లో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు మీనాకుమారి, వసంతవల్లి, శ్రీనివాసరావు, వీరమ్మ, శాంతిప్రియ, సాహితీ, వసుధ, జయశ్రీ, లక్ష్మీతిరుపతమ్మ, బయ్యా శంకర్, అశ్విని, అనూష, నూర్జహాన్, ఏఎన్ఎంలు, ఆశలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చినగంజాం: ఇంకొల్లు మండల వైద్య ఆరోగ్య శాఖాధికారులు, కార్యకర్తలు ఇంకొల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని ఆయుష్మాన్ భారత్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో డాక్టర్ టీ. అంజలి ఆధ్వర్యంలో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం ఉదయకుమారి, స్కూల్ పిల్లలు, సిబ్బంది పాల్గొన్నారు.



మేదరమెట్లలో ఆరోగ్య సూత్రాలు తెలుపుతూ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది



వేటపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది



జే.పంగులూరు: ర్యాలీలో మాట్లాడుతున్న డాక్టర్ మల్లికార్జునరావు

ఎమ్మెల్సీ ఎన్నికలపై ఆమంచి కసరత్తు



కారంచేడు ఎంపీపీ, జెడ్పీటీసీ, నాయకులతో ఆమంచి

కారంచేడు: మార్చి 13వ తేదీన జరగబోవు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రణాళికలపై మండలాల నాయకులకు వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ సమన్వయ కర్త ఆమంచి కృష్ణమోహన్ కసరత్తు చేశారు. మంగళవారం సాయంత్రం ఆయన పందిళ్లపల్లిలోని ఆయన నివాసం వద్ద కారంచేడు ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు, జెడ్పీటీసీ యార్లగడ్డ రజనీశ్రీనివాసరావు నాయకులతో మాట్లాడారు. ఎన్నికల ప్రశాంత వాతావరణంలో జరిగేలా, మన అభ్యర్థి విజయానికి తీసుకోవాల్సిన అన్ని రకాల జాగ్రత్తలపై వారు మాట్లాడారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ దండా చౌదరిబాబు, దగ్గుబాటి రామకృష్ణ, ముల్లా నూర్ అహ్మద్, మాదాసు సుబ్బారావు, యార్లగడ్డ శ్రీకాంత్, చిరంజీవి, నాయకులు పాల్గొన్నారు.

ఆమంచిని మర్యాద పూర్వకంగా కలిసిన ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి..



ఆమంచిని సన్మానిస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యాంప్రసాద్‌రెడ్డి

పర్చూరు: పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్‌ను వైఎస్సార్ సీపీ తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి పందిళ్లపల్లిలో మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సన్మానించి అభినందనలు తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించిన అంశాలపై ఆమంచితో చర్చించారు.

జీవన ఎరువులతో నాణ్యమైన దిగుబడులు



క్షేత్ర దినోత్సవ ప్రదర్శనలో అధికారులు, రైతులు

వేటపాలెం: పొలాల్లో జీవన ఎరువుల వాడడం వల్ల నాణ్యమైన దిగుబడులు సాధించుకోవచ్చని చీరాల వ్యవసాయ శాఖ ఏడీఏ ఉషారాణి సూచించారు. మండల పరిధిలోని చల్లారెడ్డిపాలెం, పాపాయిపాలెం, అక్కాయిపాలెం రైతు భరోసా కేంద్రాల పరిధిలో క్షేత్ర దినోత్సవం మంగళవారం నిర్వహించారు. వేపనూనె వాడకం, తవుడు ఎరలు, లింగాకర్షక బుట్టలు, పసుపు, నీలం, జిగురు అట్టల వాడకం, ట్రైకోడెర్మావిరిడై, సూడోమోనాస్ వంటి జీవన ఎరువులు వాడకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఏవో అబ్దుల్ సత్తార్, ఏఓ కాశీవిశ్వనాథ్, మండల వ్యవసాయ సలహా కమిటీ అధ్యక్షుడు పీ శ్రీనివాసరావు రైతులు పాల్గొన్నారు.

ముందు జాగ్రత్తలతో క్యాన్సర్‌కు చెక్



మానవహారం ఏర్పాటు చేసిన వైద్య, ఆరోగ్య సిబ్బంది

చినగంజాం: ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి ఎస్ విజయ భాస్కర్ ఆధ్వర్యంలో జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఫిబ్రవరి 14వ తేదీ వరల్డ్ క్యాన్సర్ డే పురస్కరించుకొని అవగాహన సదస్సులు నిర్వహిస్తూ క్యాన్సర్ వ్యతిరేక దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఇందులో భాగంగా ర్యాలీ నిర్వహిస్తూ నినాదాలు, ప్లకార్డ్స్, ఫ్లెక్సీలులతో జెడ్పీ హైస్కూల్, సాయిబాబా గుడి మీదుగా స్టేట్ బ్యాంకు బజార్, అంబేడ్కర్ సెంటర్ వరకు కొనసాగించారు. మానవహారం ఏర్పాటు చేసి ప్రజలకు క్యాన్సర్ నివారణ, మంచి ఆరోగ్య అలవాట్లు, పౌష్టికాహారం, వ్యాయామం, యోగా, ధ్యానం, మొదలగు అంశాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసరావు, హెచ్ఈ ఎన్ హరిప్రసాదరావు, సూపర్ వైజర్‌లు పీవీ సుబ్బారావు, రాజకుమారి, సబ్ సెంటర్ సీహెచ్ఓలు, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

గుడ్ల దొంగతనంపై డీఈవో విచారణ

వేటపాలెం: జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల్లో వాచ్‌మెన్, సిబ్బంది కలసి కోడిగుడ్లు దొంగతనం చేసిన విషయంపై బాపట్ల జిల్లా డీఈవో రామారావు మంగళవారం విచారణ చేశారు. ముందుగా హెచ్‌ఎం దుర్గా ప్రసాద్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. హెచ్‌ఎం మాట్లాడుతూ తన కార్యాలయం రూములో ఉంచిన కోడి గుడ్లను వాచ్‌మెన్ బంధువులైన స్వీపర్లు తాను క్లాస్ రూమ్‌ల పరిశీల కోసం వెళ్లిన సమయంలో దొంగిలించారని తెలిపారు. అనంతరం వాచ్‌మెన్ కన్నయ్యను విచారించగా తనకు తెలయకుండానే స్కూల్‌లో స్వీపర్‌గా పనిచేస్తున్న తన బంధువులు కోడి గుడ్లు, బియ్యం దొంగిలించినట్లు అధికారులకు వివరించారు. వాచ్‌మెన్ బందువులు తాత్కాలిక స్వీపర్లుగా వ్యవహరిస్తున్న నలుగురిని విచారించారు. తామే హెచ్‌ఎం రూమ్‌లో ఉంచిన గుడ్లు దొంగిలించినట్లు అంగీకరించారు. అనంతరం హెచ్‌ఎం, వాచ్‌మెన్, స్వీపర్ల వద్ద రాతపూర్వక నివేదికలు తీసుకున్నారు. స్కూల్‌లో 650 మంది విద్యార్థులు హాజరు కాగా కేవలం 140 మంది మాత్రమే మధ్యాహ్నం భోజనం చేయడంపై హెచ్‌ఎంని, ఉపాధ్యాయులను విచారించారు. నివేదికను కమిషనర్, జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు. వీరి వెంట డిప్యూటీ డీఈవో కిరణ్‌కుమార్, ఎంపీడీవో శర్మ, ఈఎంఈఓ సుబ్బయ్య ఉన్నారు.

జవాన్ల త్యాగం వెలకట్టలేనిది



అమర వీరులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు, పోలీసులు

చీరాల అర్బన్: ఉగ్రవాదుల దాడిలో అమరులైన జవాన్ల త్యాగాలు మరువలేమని ఎన్‌సీసీ అధికారులు, వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాల ప్రిన్సిపాల్ పి.సత్యనారాయణ అన్నారు. పూల్వామా ఉగ్రవాదుల దాడిలో అమరులైన జవాన్లకు 23 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ క్యాడెట్లు ఘన నివాళులర్పించారు. పట్టణంలోని మసీదు సెంటర్ నుంచి గడియార స్తంభం సెంటర్, కూరగాయల మార్కెట్ మీదుగా ఎన్‌సీసీ క్యాడెట్లు, పట్టణ పోలీసులు కొవ్వొత్తులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గడియార స్తంభం సెంటర్లో అమర వీర జవాన్లకు శ్రద్ధాంజలి ఘటించి నివాళులర్పించారు. పూల్వామా ఉగ్రవాదుల దాడిలో అమరులైన జవాన్లు పోరాటాలను అందరు పుణికి పుచ్చుకోవాలని, ఉగ్రవాదుల దాడిలో అమలరులైన వారికి ప్రతి ఒక్కరూ సంతాపం తెలన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి ఎం.రాజేష్‌బాబు, పోలీసులు, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు లేకుండా చూడాలి



మాట్లాడుతున్న అధికారులు

మార్టూరు: వేసవి దృష్ట్యా ప్రజలకు అవసరమైన తాగు, సాగునీటి సరఫరాపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జెడ్పీ వైస్ చైర్మన్ చుండి సుజ్ఞానమ్మ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. చెరువులను సాగర్ జలాలతో నింపాలని, గ్రామీణ ప్రాంతాల్లోని బోరులకు మరమ్మతులు చేసి తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. ఎంపీపీ భూక్యా శాంతిబాయి మాట్లాడుతూ గ్రామాల్లో అక్కడక్కడ విద్యుత్ సమస్యలు ఉన్నాయని, అధికారులు పరిష్కరించాలని అన్నారు. ఎంపీడీవో జీ నితిన్ మాట్లాడుతూ ప్రస్తుతం ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున సమస్యల పరిష్కారం చేపడతామన్నారు. హౌసింగ్ ఏఈ విజయానంద్ మాట్లాడుతూ ఉగాది నాటికి 1084 జగనన్న గృహ నిర్మాణాలు పూర్తి చేసి గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు తమ నివేదికను వివరించారు. సమావేశంలో ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

మార్టూరు: పాముకాటుకు గురైన మహిళ వైద్య చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈఘటన మండలంలోని నాగరాజుపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. నాగరాజుపల్లి గ్రామంలోని ఎస్టీ కాలనీకి చెందిన కొణిదెన వీరవాణి (41) గత శుక్రవారం కూలీ పనుల కోసం వెళ్లి పాముకాటుకు గురైంది. తోటి కూలీలు ఆమెను స్థానిక వైద్యుల వద్ద ప్రథమ చికిత్స చేయించి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం చిలకలూరిపేటలోని ఓ ప్రవేట్ వైద్యశాలకు తరలించారు. మంగళవారం పరిస్థితి విషమించి ఆమె మృతి చెందింది.

భక్తులకు అసౌకర్యం కలుగకూడదు



మాట్లాడుతున్న సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బ్రహ్మానందరెడ్డి

చినగంజాం: శివరాత్రి తిరుణాళ్లలో వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా నిర్వహించుకోవాలని చీరాల డీఎస్పీ పీ శ్రీకాంత్ సూచించారు. మంగళవారం మండల పరిధిలో శివరాత్రి తిరుణాళ్ల నిర్వహించే బాలకోటేశ్వర దేవస్థానం, రామకోటేశ్వర దేవస్థానం కమిటీలతో ఆయన పీస్ కమిటీ సమావేశం ఎస్సై కట్టా అనుక్ అధ్యక్షతన నిర్వహించారు. ఆలయ కమిటీలతో ఆయన మాట్లాడుతూ క్యూలైన్‌లు, తాగు నీటి సౌకర్యం, ఎండ తీవ్రత తగలకుండా షామియానాలు వంటి చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్‌కు ఎటువంటి అడ్డంకి లేకుండా ప్రత్యేక పార్కింగ్, వాహనాలకు, భక్తులకు ఇన్, ఔట్ సక్రమంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. వైద్యాధికారులు శిబిరాలు ఏర్పాటు చేయాలని, ఎండ వేడిమి కారణంగా భక్తులకు వచ్చే డీ హైడ్రేషన్ ఎదుర్కొనేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఎస్ విజయభాస్కర్, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఆసోది బ్రహ్మానందరెడ్డి, రెండు ఆలయాల కమిటీ సభ్యులు టీఎస్సార్ ఆంజనేయులు, ఎస్ రామిరెడ్డి, టీ సీతారామయ్య, రామకృష్ణారెడ్డి, ఏసీబీ సీఐ టీ శ్రీనివాసరావు, రిటైర్డ్ పోలీస్ ఇంజనీర్ పీ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పార్టీలు సహకరించాలి



రాజకీయ నాయకులతో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటరెడ్డి

మార్టూరు: రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న ఉపాధ్యాయ, పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అన్ని రాజకీయ పార్టీల నాయకులు ప్రభుత్వంతో సహకరించాలని తహసీల్దార్ వెంకటరెడ్డి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం రాజకీయ పార్టీల నాయకులతో ఆయన మాట్లాడారు. మార్చి 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు మార్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పట్ట భద్రుల ఎన్నికకోసం 2, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక కోసం ఒకటి చొప్పున మొత్తం 3 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఫిబ్రవరి 9 నుంచి ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున రాజకీయ పార్టీల నాయకులు ఫ్లెక్సీలు, బ్యానర్‌లు స్వచ్ఛందంగా తొలగించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ, టీడీపీ, సీపీఎం, బీఎస్పీ, మజ్లిస్ పార్టీల నాయకులు పాల్గొన్నారు.